క్లుప్తంగా

పేదలకు అండగా ప్రభుత్వం



అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. గురువారం పట్టణ కూడలిలోని క్యాంపు కార్యాలయంలో మానవపాడు మండలం అమరవాయి గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ. 2.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ఎల్ఓసీని అందజేశారు. కార్యక్రమంలో శంకర్ గౌడు, నర్సన్ గౌడు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణీ, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో ఆమె మాట్లాడుతూ ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని వైద్యసిబ్బందికి సూచించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏ ఎన్ఎంలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థినికి గోల్డ్‌మెడల్



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన విద్యార్థిని వైష్ణవి వరంగల్‌లో నిర్వహించిన కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో సర్పంచు నారాయణమ్మ, కలుగోట్ల పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డిలు వైష్ణవిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి, భీమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని తెలిపారు. కార్యక్రమంలో సంధ్యారాణి, తిరుమల్‌రావు, సోని, జయమ్మ, అనూష, పరిమాళ పాల్గొన్నారు.

ముమ్మరంగా కంటివెలుగు



మానవపాడు: మండలంలోని కలుకుంట్లలో గురువారం డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో కంటి వెలుగు వైద్య శిబిరం నిర్వహించారు. 121 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా 10 మందికి అద్దాలు పంపిణీ చేశారు. ఆరుగురికి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫర్నిచర్ దగ్ధం

గద్వాల క్రైం: రెండు లక్షల విలువైన ఫర్నిచర్ దగ్ధమైన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాకు చెందిన గోపాల్ జీవనోపాధి కోసం రెండు నెలల కిందట జిల్లా కేంద్రానికి వచ్చాడు. ఫుట్‌పాత్‌పై సోఫాసెట్, కుర్చీలు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఫర్నిచర్‌కు నిప్పంటించారు. గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. ఫర్నిచర్ పూర్తిగా దగ్ధం కావడంతో బాధితుడు కన్నీటిపర్యంతం అయ్యాడు.

పల్లె వనాలు కళకళ



కోదండాపురంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం

- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు
- గ్రామాలలో ఆహ్లాదకర వాతావరణం

అలంపూర్ నియోజకవర్గంలో పల్లె ప్రకృతి వనాలు

మండలం	పంచాయతీలు	పూర్తైన వనాలు
ఇటిక్యాల	29	29
మానవపాడు	16	16
ఉండవెల్లి	16	16
అలంపూర్	14	14
రాజోలి	11	11
వడ్డేపల్లి	10	10
అయిజ	28	28

ఎర్రవల్లిచౌరస్తా: పట్టణాలలోని పార్కులకు దీటుగా గ్రామాలలో పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రణాళికా ప్రకారం ముందుకెళ్లడంతో సత్ఫలితాలు సాధించింది. గ్రామ పంచాయతీల పరిధిలోని పల్లె ప్రకృతి వనాలలో గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ నిధులతో మొక్కలు నాటారు. వివిధ రకాల పూల, పండ్ల మొక్కలతో పాటు అందమైన మొక్కలతో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం వనాలు ఆహ్లాదకరమైన వాతావరణం కనబడుతోంది. దాతల సహకారంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆట పరికరాలు, వస్తువులు ఏర్పాటు చేశారు.

పంచాయతీలలో పనులు పూర్తి

అలంపూర్ నియోజకవర్గంలో 124 పంచాయతీలకు గాను 118 జీపీల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామ పంచాయతీలలో పనులు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాలలోని ఎకరా, అర



గోపల్‌దిన్నె ప్రకృతి వనంలో అందంగా ఏర్పాటు చేసిన రోడ్లు

ఎకరా, పది గుంటలు ఉన్న ప్రభుత్వ స్థలాలలో రూ. 2 లక్షల నుంచి రూ. 6 లక్షల వ్యయంతో ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఎకరా స్థలంలో 4 వేల మొక్కలను పెంచుతున్నారు. అందులో టేకు, పండ్లు, పూలు, ఔషధ మొక్కలతో పాటు 40 రకాల చిన్న, పెద్ద రకం మొక్కలను నాటారు. గ్రామ పంచాయతీ నిధులతో చుట్టూ ఇనుప కంచె ఫినిషింగ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మొక్కలకు నిత్యం పంచాయతీ వనమాలి ద్వారా నీటిని అందిస్తున్నారు.

అన్ని హంగులతో ప్రకృతి వనాలు

పల్లె ప్రకృతి వనాలకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో వనాలలో అన్ని పనులు పూర్తి అయ్యాయి. పార్కులో ఉదయం సాయంత్రం వేళల్లో యువకుల, వృద్ధులు సేద దీరేందుకు వీలుగా దాతల సహకారంతో పలు వసతులను ఏర్పాటు చేస్తున్నారు. వనాలు పల్లెలు పులకరించేలా అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. పిల్లలు ఆటలు ఆడేందుకు గాను క్రీడా సామాగ్రిని దాతల సహకారంతో సమకూరుస్తున్నారు. వనాలలో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. చుట్టూ ఉన్న ప్రహరీలకు వేసిన రంగు రంగుల పెయింటింగ్స్ అందరిని ఆకట్టుకుంటున్నాయి. స్థానిక, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం



పల్లె ప్రకృతి వనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎకరా ప్రభుత్వ స్థలంలో వనం ఏర్పాటు చేశాం. జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా 40 రకాల మొక్కలను నాటి పెంచుతున్నాం. పంచాయతీ నిధుల నుంచి చుట్టూ ఇనుప కంచె, జీపీ సిబ్బంది ద్వారా నిత్యం మొక్కలకు నీటిని అందిస్తున్నాం. గ్రామీణ పార్కులను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం.

– రాజేశ్వరెడ్డి, కార్యదర్శి, కోదండాపురం

దాతలు ముందుకు రావాలి



పల్లె ప్రకృతి వనాలలో పంచాయతీ నిధులతో 26 రకాల మొక్కలు నాటాం. దాతలు ముందుకు వస్తే అవసరమైన క్రీడా సామాగ్రి, సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేస్తాం. అదేవిధంగా ప్రకృతివనం చుట్టూ ఉన్న ప్రహరీ ఆకట్టుకునేలా రంగు రంగుల పెయింటింగ్స్‌ను వేయిస్తాం. ప్రకృతి వనాల ఏర్పాటుతో పల్లెలకు పచ్చదనంతో పాటు కొత్తకళ వచ్చింది.

– స్వాతి, సర్పంచ్, పుటాన్‌దొడ్డి

వనాల పనులు పూర్తి



మండలంలోని 29 పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను నిర్మించాం. ఎకరా స్థలంలో నాలుగు వేల మొక్కల చొప్పున సుమారు 40 రకాల మొక్కలను నాటి సంరక్షిస్తున్నాం. మూడు సంవత్సరాల వరకు మొక్కలకు నీరు అందించేందుకు గాను ప్రతి వనానికి వనమాలిని నియమించాం. ఎక్కడైన మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గ్రామస్తులకు పార్కులు లేని లోటు తీరింది.

– భాస్కర్, మండల పంచాయతీ అధికారి, ఇటిక్యాల

జీవాలను కాపాడుకుందాం



మేకలసోంపల్లిలో మందులను తాపిస్తున్న డాక్టర్ యామినిసాయి

మల్దకల్: జీవాలను కాపాడుకుందామని డాక్టర్ యామినిసాయి అన్నారు. గురువారం మండలంలోని తాటికుంట, మేకలసోంపల్లి, ఎల్కూర్, కుర్తిరావల్‌చెర్వు, విఠలాపురం, బిజ్వారం గ్రామాలలో గొర్రెలకు నట్టల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యామినిసాయి మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు ఏడాదికి మూడుసార్లు నట్టల మందులను తప్పనిసరిగా తాపించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలలో మొత్తం 7526 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు రాధ, సత్యమ్మ, లక్ష్మన్న, పశు వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, రాజేంద్ర, రామాంజనేయులు, మధు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని బైనిపల్లి, కొత్తపల్లి, పర్దిపురం, కిష్టపురం గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు పశు వైద్య సిబ్బంది నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వరూపరాణి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేయించి వాటిని కాపాడుకోవాలని కోరారు. శుక్రవారం మండలంలోని చిన్న తాండ్రపాడు, వేణిసోంపురం, తొత్తినోనిదొడ్డి మూగోని పల్లి గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు మందులు వేస్తామని పేర్కొన్నారు.

గట్టు: గొర్రెల, మేకలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆరగిద్దలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీకాంత్, వెటర్నరీ అసిస్టెంట్ పృథ్వీ, గోపాలమిత్ర ఉరుకుందు, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

గట్టు: ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ నిర్వాహకుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలంటూ వంట ఏజెన్సీ నిర్వాహకుల సంఘం నాయకులు గురువారం జిల్లా కేంద్రంలో డీఈఓకు వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఉపాధ్యక్షురాలు సోమేశ్వరమ్మ, వర్కింగ్ ప్రసిడెంట్ సరోజమ్మ, ప్రధాన కార్యదర్శి తిప్పన్నలతో పాటుగా వంట ఏజెన్సీ నిర్వాహకులు డీఈఓను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. పెంచిన గౌరవ వేతనంతో పాటుగా 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వంట ఏజెన్సీ బిల్లులను తక్షణమే విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

పనులు వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో చేపట్టిన మిషన్ భగీరథ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. గురువారం పట్టణంలోని వివిధ కాలనీల్లో మిషన్ భగీరథ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. మొత్తం 20 వార్డుల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ దాదాపు పూర్తిచేసి ప్రతి ఇంటికి నల్లాలు అమర్చినట్లు తెలిపారు. పైప్ లైన్ నిర్మాణం కోసం సీసీ రోడ్డును తవ్వారని, వాటికి ఇప్పుడు ప్యాచ్ వర్క్ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ గోపాల్, మేనేజర్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీ విద్యుత్ లైన్ మార్చాలని ఆందోళన

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని ఎల్‌టీ విద్యుత్ లైన్‌ను వెంటనే మార్చాలంటూ కాలనీకి వచ్చిన ట్రాన్స్‌కో ఏడీ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజాను కాలనీవాసులు నిలదీసిన సంఘటన గురువారం చోటుచేసుకోంది. శ్రీకృష్ణనగర్‌లో ఇళ్ల మధ్య నుంచి వెళ్తున్న ఎల్‌టీ విద్యుత్ హైటెన్షన్ లైన్ ద్వారా బుధవారం రాత్రి పలువురి ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు కాలిపోవడంతో ట్రాన్స్‌కో ఏడీ రాంనారాయణరెడ్డితో పాటు ట్రాన్స్‌కో ఏఈ, లైన్ మెన్లు పరిశీలించడానికి కాలనీకి వచ్చారు. వీరితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారు. దీంతో కాలనీవాసులు వార్డు కౌన్సిలర్ విజయరాములు కలిసి విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ పట్టుబట్టారు. ఈ వ్యవహారంలో చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా జోక్యం చేసుకొని లైన్ మార్చేందుకు అయ్యే ఖర్చును వెంటనే అంచనా వేస్తామన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి చొరవతో సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. కార్యక్రమంలో నాగభూషణంగౌడ్, ట్రాన్స్‌కో ఏఈ రాంచందర్, లైన్‌మెన్ రాజు, తిరుమలేష్, చింతకుంట వెంకటేష్, బొగ్గు రఘు, ఉన్నారు.



ట్రాన్స్‌కో, మున్సిపల్ అధికారులతో కాలనీవాసుల వాగ్వాదం

కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు



అమరచింతలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

అమరచింత: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులకు కలెక్టర్ ఆదేశానుసారం గురువారం వైద్య పరీక్షలు నిర్వహించామని డాక్టర్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతత, పౌష్టికాహారం, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహన కలిస్తూ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో మొత్తం 267 మంది విద్యార్థినులు ఉండగా.. 138 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారన్నారు. రక్తహీనత పిల్లల సంఖ్య 12, జ్వరం బారిన ఐదుగురు, జలుబు, దగ్గులతో 31 మందిని గుర్తించామన్నారు. వీరితో పాటు చర్మ సంబంధిత వ్యాధులు ఉన్నవారు 37 మంది ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా 35 మందితో రక్త నమూనాలను సేకరించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ కవిత, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం మొబైల్ టీం ఫార్మసిస్ట్ యాదయ్య, ఆరోగ్య కార్యకర్త చిలుకమ్మ, హెల్త్ కౌన్సిలర్ రవి, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, ఏఎన్ఎం శారద తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్



ధరూరు: క్రీడలతో బంగారు భవిష్యత్ ఉంటుందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరంచుకుని రెండు రోజులుగా నిర్వహించిన ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు నగదు బహుమతులతో పాటు షీల్డులను అందజేశారు. ముఖ్య అతిథిగా గొంగళ్ల రంజిత్ కుమార్ హాజరై బహుమతులను అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి రూ.10, 116, రూ.5,116, రూ.3,116 నగదులను ఆయా జట్లుకు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోవిందు, జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు రంగస్వామి, మునెప్ప, రాము, మండల నాయకులు సుదర్శన్, జగదీష్, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం



బిజ్వారం గ్రామ పంచాయతీ వెనక రోడ్డు పక్కన నిలిచిన మురుగు

- ఇళ్ల ముందే మురుగు పరుగు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మల్దకల్: ప్రభుత్వం పారిశుద్ధ్యానికి ఎన్ని చర్యలు తీసుకున్నా నిరుపయోగంగా మారింది. గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కనీసం మురుగుకాలువలు లేక మురుగు ఇళ్ల మధ్యే ప్రవహిస్తున్న దుస్థితి నెలకొంది. కంపువాసన భరించలేక ఎప్పుడు కిటికీలు, తలుపులు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. మురుగుపై దోమలు ఆవాసాలు ఏర్పరుచుకున్నాయి. రోజురోజుకు దోమల బెడద అధికమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రోగాలబారిన పడాల్సిన పరిస్థితి నెలకొందని. అధికారులకు విన్నవించినా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్లపైనే మురుగు

సీసీ రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మాణాలు చేపట్టకపోవడంతో మురుగు రోడ్లపై నిలుస్తోంది. నాగర్‌దొడ్డి, మల్దకల్, బిజ్వారం గ్రామాల్లోని బీసీ కాలనీలలో ఇళ్ల మధ్యనే మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే ఉలిగేపల్లి, అడివిరావల్‌చెర్వు, తాటికుంట, ఎల్కూరు, పెద్దొడ్డి, విఠలాపురం, మద్దెలబండ గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.



మల్దకల్ బీసీ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు

పట్టించుకోని అధికారులు

రోడ్లపై మురుగు ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలి



గ్రామాలలో మురుగుకాలువల నిర్మాణాలు చేపట్టాలి. గ్రామ వీధులలో మురుగు ప్రవహిస్తోంది. చిన్నారులు, మహిళలు బయటికి వచ్చేందుకు భయపడుతున్నారు. కంపు వాసన భరించలేకపోతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.


– ధర్మన్న, నాగర్‌దొడ్డి

దోమల బెడద భరించలేకున్నాం



కాలనీలలో దోమల బెడద ఎక్కువ అయ్యింది. మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. రోగాల బారిన పడుతున్నాం. వృద్ధులు అవస్థలు పడుతున్నారు. – బ్రహ్మాజీరావు, మల్దకల్

సమస్యల పరిష్కారానికి చర్యలు



గ్రామాలలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పారిశుద్ధ్య చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాం. ప్రతి రోజు కార్మికులతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతాం. – కృష్ణయ్య, ఎంపీడీఓ మల్దకల్

శంభో శంకరా.. పాహిమాం



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన



జాతరకు హాజరైన భక్తులు

ఆత్మకూర్: పట్టణం శివారులోని చెరవులో వెలసిన శ్రీశ్రీ స్వయంభు పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చి పులుసు, అన్నాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా వేలాది మంది భక్తులు స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి రథోత్సవంపై విగ్రహాలు ఉంచి తేరు లాగారు.

ప్రముఖుల పూజలు

అనంతరం ప్రముఖ పూజారి కర్నసయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ బంగారుశ్రీను, జెడ్పీటీసీ శివరంజని, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్లరామకృష్ణ, పోశన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సూం, రైతుసంఘం అధ్యక్షుడు వీరేశలింగం, వైస్ ఎంపీపీ కోటేష్, అనిల్‌కుమార్‌గౌడ్, గద్దమీది శ్రీను ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన కర్ణాటక కళాకారులు

జాతర సందర్భంగా తేరుకు కర్ణాటకలోని తూంకూర్‌కు చెందిన ప్రముఖ వీరగాసే కళాకారుల నిర్వహించిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి, గాంధీచౌక్‌లో అగ్నిజ్వాలల్లో శులాలు గుచ్చుకునే దృష్యాలు భక్తులను అబ్బురపరచాయి. భాజభజంత్రీలు, డప్పువాయిద్యాలు, బాణసంచా ప్రదర్శనలు నిర్వహించారు. ఎస్ఐ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.